క్లుప్తంగా

ఆనందంగా ఉండాలి


పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: మబగాం గ్రామంలో ఉగాది పురస్కరించుకుని శనివారం నిర్వహించిన పంచాంగ శ్రవణంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. లక్ష్మీధనుంజయశర్మ విశ్వావసు నామ సంవత్సర విశేషాలను తెలియజేశారు. ప్రజలందరూ ఆనందంగా ఉండాలని, అందరికీ మంచి జరగాలని కృష్ణదాస్ ఆకాంక్షించారు. జిల్లా, నరసన్నపేట నియోజకవర్గ ప్రజలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు



ఆమదాలవలస: శ్రీకాకుళం జిల్లా, ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలకు మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం శనివారం ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది పొడుగునా పాడి, పంటలతో రైతన్నలు సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

అందరికీ మంచి జరగాలి



ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది నుంచి రైతులతోపాటు అన్ని వర్గాల వారికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

సుఖసంతోషాలు కలగాలి



ఆమదాలవలస: నియోజకవర్గ ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం ఉగాది శుభాకాంక్షలను తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న చింతాడ రవికుమార్


ఆమదాలవలస: స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో హృదయ స్పందన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. రక్తదానం చేసిన యువకులకు ధ్రువపత్రాలను అందజేశారు. పార్టీ కార్యకర్తలు, సంస్థ అధ్యక్షుడు పాల్గొన్నారు.

మార్కెట్‌కు ఉగాది శోభ


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్

నరసన్నపేట తెలుగు పండగ ఉగాది సందర్భంగా నరసన్నపేట మార్కెట్ శనివారం కొనుగోలుదారులతో సందడి నెలకొంది. మామిడి కాయలు, వేప పువ్వు, బల్లంతోపాటు పూలు, మామిడి కొమ్మలు, చెరకు వంటివి ప్రజలు కొనుగోలు చేశారు. కొత్త అకౌంట్ పుస్తకాలు కోసం బుక్ షాపుల వద్ద రద్దీ నెలకొంది. సంక్రాంతి తరువాత మార్కెట్‌కు ఉగాది సందర్భంగా కొత్త కళ వచ్చింది.

పడిగాపులు


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వేచి ఉన్న దరఖాస్తుదారులు

మెళియాపుట్టి బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి శనివారం మెళియాపుట్టి ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూల నిర్వహణకు అధికారులు పిలుపునిచ్చారు. దరఖాస్తుదారులు ఉదయం పది గంటలకే చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంట అయినా పలు బ్యాంక్‌లకు చెందిన అధికారులు హాజరు కాలేదు. మధ్యాహ్నం 2 గంటల తరువాత మండల పరిషత్ సిబ్బంది దరఖాస్తులను స్వీకరించారు. మండల వ్యాప్తంగా 69 మందికి రుణాల మంజూరుకు బ్యాంకు అధికారులు అవకాశం కల్పించారు. మొత్తం 309 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కాలుష్య కోరల్లో గ్రామాలు!

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- ఇటుకల తయారీ యజమానుల ఇష్టారాజ్యం


నిల్వ ఉన్న బొగ్గు వ్యర్థం

ఆమదాలవలస రూరల్: ప్రజల ప్రాణాలతో కొంత మంది ఇటుక బట్టీల యాజమానులు చెలగాటమాడుతున్నారు. కాలుష్య కోరల్లో పలు గ్రామల ప్రజలు కొట్టిమిట్టాడుతున్నారు. ఆమదాలవలస మండలంలోని పలు గ్రామాల పరిసరాల్లో ఇటుకల తయారీకి బొగ్గు వ్యర్థాలు వాడటం వల్ల వాయు కాలుష్యం పెరిగి అనేక మంది దీర్ఘకాలిక వాధుల బారీన పడుతున్నారు. నాగావళి నదీతీరంలోని దూసిపేట, ఇసకలకేట, నారిపేట, కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లివాడ, వంజంగి, తదితర గ్రామాల్లో ఇటుకలను చాలా కాలంగా తయారు చేస్తున్నారు. ఇటుకలను కాల్చేందుకు గతంలో కర్రను వాడేవారు. ప్రస్తుతం బొగ్గుతో కూడిన వ్యర్థాలు, వరి ఊక వంటివి వాడటం వల్ల వాయు కాలుష్యం పెరిగి అనేక మంది ఇబ్బంది పడుతున్నారు.

శ్వాసకోశ వ్యాధులు..

బొగ్గు వ్యర్థాలు వాడటం వల్ల శ్వాసకోశ వ్యాధులతో అనేక మంది బాధపడుతున్నారు. పొగతోపాటు ధూళి ఎగరటం వల్ల కంటి సంబంధిత వ్యాధుల బారీన పడుతున్నారు. ముఖ్యంగా ఊపిరి తిత్తులు, కీళ్లనొప్పులు, కిడ్నీకి సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కార్మికుల జీవితాలో ఆటలు.

ఇటుక బట్టీల తయారీ యజమానులు ఇక్కడ పని చేసే కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. రోజంతా పనిచేసిన కార్మికులకు అరకొరగా కూలీ డబ్బులు చెల్లించి.. యజమానులు మాత్రం లక్షలు ఆర్జిస్తున్నారు. ఇటుక బట్టీలు కుటీర పరిశ్రమలా నడుస్తున్నప్పటికీ.. వీటిని పరిశ్రమశాఖ గుర్తించడంలేదు. దీంతో బట్టీ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బట్టీల ఏర్పాటు విషయం పక్కన పెడితే... కార్మిక, కాలుష్య నియంత్రణ మండలి శాఖలకు మాత్రం చర్యలు తీసుకునే అవకాశమైనా ఉంటుంది. ఇప్పటికైనా ఇటుక బట్టీల యజమానులపై తగిన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని, కాలుష్యాన్ని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.


ఇటుక బట్టీల నుంచి వస్తున్న పొగ


బొగ్గు వ్యర్థంతో తయారు చేసిన ఇటుకలు

వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ



బొగ్గు వ్యర్థాలు అధికంగా వాడటం వల్ల వాయుకాలుష్యం పెరిగి అనేక శ్వాసకోశ వ్యాధులు రావటానికి ఎక్కువ అవకాశం ఉంది. అనారోగ్య కారణంగా కొంత కాలాని ఆహారం కూడా తిన లేరు. ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

– డి.సురేష్, వైద్యాధికారి, అర్బన్ సెంటర్, ఆమదాలవలస

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం..



బొగ్గు వ్యర్థాలతో ఇటుకలను ప్రతిరోజూ కాల్చుతున్నారు. పొగ అధికంగా రావడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. అధికారులు వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

– ఇప్పిలి శ్రీనివాసరావు, పాతనిమ్మతొర్లివాడ, ఆమదాలవలస మండలం

నాలుగు లారీలు ఢీ


ఒకదానికొకటి ఢీకొన్న వాహనాలు


ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు


ముందున్న లారీని ఢీ కొన్న ఆయిల్ ట్యాంకర్

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి అండర్ పాసేజ్ వద్ద శనివారం రాత్రి నాలుగు లారీలు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. వీటిలో రెండు కంటైనర్లు, ఒక అరటి గెలల లారీ, మరో ఆయిల్ ట్యాంకర్ ఉన్నాయి. ఫ్లై ఓవర్ డౌన్‌కావడంతో వేగం అదుపు చేయలేక ప్రమాదం జరిగిందని అరటి గెలల లారీ డ్రైవర్ బడి శేషరెడ్డి తెలిపారు. ప్రమాదంలో లారీల ముందు భాగాలు దెబ్బ తిన్నాయి. సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రికార్డుల పరిశీలన

పోలాకి: మండలంలోని పోలాకి, గుప్పెడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన ఆన్‌లైన్, ఆఫ్ లైన్ రికార్డులను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ శనివారం పరిశీలించింది. జిల్లా గణాం కశాఖ అధికారి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో మబగాం, బొద్దాం ఉపకేంద్రాల్లో ఆయుస్మాన్ ఆరోగ్య కార్యక్రమాల వివరాలపై సమీక్షించారు.









స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.5,600 కోట్లు

- స్త్రీనిధి ఎం.డి హరిప్రసాద్


మాట్లాడుతున్న హరిప్రసాద్

నరసన్నపేట: రాష్ట్రంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో స్వయం శక్తి సంఘాలకు స్త్రీనిధి ద్వారా రూ.5,600 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్త్రీనిధి ఎం.డి హరిప్రసాద్ తెలిపారు. నరసన్నపేటకు శనివారం విచ్చేన సందర్భంగా మాట్లాడారు. 2024–25లో రూ.4 వేల కోట్ల రుణాలు కల్పించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీనిధి ద్వారా రూ.7,800 కోట్ల టర్నోవర్‌కు పెంచామన్నారు. రీ పేమెంట్ చాలా బాగుందన్నారు. రాష్ట్రంలో ఉన్న స్వయం శక్తి సంఘాల సంఖ్య దేశంలోనే అధికంగా ఉందని, ఇక్కడి సంఘాలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. రాష్ట్రంలో 89 వేల సంఘాలు ఉండగా.. వీటిలో 50 వేల సంఘాలకు స్త్రీనిధి రుణాలు ఇచ్చామన్నారు. సంఘాల్లో మొండి బకాయిలు బాగా తగ్గాయన్నారు. రానున్న రోజుల్లో ఎస్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా కేంద్ర నిధులతో రుణాలు ఇవ్వనున్నామని, ఇది అమలు అయితే వడ్డీ బాగా తగ్గుతుందన్నారు. ప్రస్తుతం 11 శాతం వడ్డీ వసూలు చేస్తుండగా.. కేంద్రం నుంచి సంఘాలకు రుణం వస్తే.. వడ్డీ 7 శాతం వరకు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వయం శక్తి సంఘాలను సర్వే చేయిస్తున్నామన్నారు. ఈ సర్వే ద్వారా స్వయం శక్తి సంఘాల మహిళల్లో ఆర్థికాభివృద్ధి ఏ స్థాయిలో ఉందనేది తెలుస్తుందన్నారు. ఈ సర్వే ప్రకారం రుణ ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.

శిక్షణ శిబిరం పరిశీలన..


సర్వేకు సంబంధించి శ్రీకాకుళం, మన్యం జిల్లాలకు ప్రత్యేకాధికారిగా హరిప్రసాద్‌ను నియమించడంతో నరసన్నపేట వెలుగు కార్యాలయంలో గతమూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్ల శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సర్వే కోసం 8,800 మందిని ఎంపిక చేశామని, విడతలు వారీగా శిక్షణ ఇస్తామన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వెలుగులో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ అండర్ టన్నల్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు శనివారం తెలిపారు. మృతుడు శ్రీకాకుళం పట్టణంలోని గునాపాలెంకు చెందిన జల్లిన లీలా రమణారావు(49)గా గుర్తించారు. అతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడని, ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం తమ ఇంటి నుంచి బయల్దేరి వచ్చాడన్నారు. రాత్రి సమయానికి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు మృతుని సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఆమదాలవలస వైపు వచ్చి వెదికారు.

ఆ సమయంలో ట్రాక్‌పై ఉన్న మృతదేహం రమణారావుదిగా గుర్తించి జీఆర్పీ సిబ్బందికి తెలియజేశారు. జీఆర్‌పీ ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి శవ పంచనామాకు తరలించారు. ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. మృతుని భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పరామర్శ..


బూర్జలో వ్యాపారి తులసమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని పలు కుటుంబాలను ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. సింగన్నపాలెం గ్రామానికి చెందిన తులగాపు సూరపునాయుడు కారు ప్రమాదంలో, చీడివలస గ్రామానికి చెందిన బూరి మణికుమార్ విద్యుత్ షాక్‌తో, బూర్జ గ్రామానికి చెందిన వ్యాపారి తులసమ్మ, సన్నాయిల సత్యం, పాలవలస గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ముదిల అప్పలస్వామి, పెద్దకురింపేటకు చెందిన కొరికాన దాలినాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా కుటుంబాలకు రవికుమార్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి, నాయకులు వియ్యపు కృష్ణమూర్తి, జల్లు బలరాంనాయుడు, ఏగు రాజారావు, తొత్తడి సురేష్, సైరిగాపు శివ, సాకేటి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్లు, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

రెడ్డి శాంతికి అభినందన


రెడ్డి శాంతికి అభినందనలు తెలుపుతున్న హిరమండలం వైఎస్సార్‌సీపీ శ్రేణులు

హిరమండలం: వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. మరోసారి పాలవలస రాజశేఖరం కుటుంబంపై గౌరవాన్ని చాటుకున్నారు. రెడ్డి శాంతిని పాతపట్నంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో హిరమండలం నాయకులు శనివారం అభినందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు. పాతపట్నంలోని ఆమె కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది.

విద్యార్థుల సేవలో వందేళ్లు..


డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు కొత్తూరు ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పారాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శత వార్షికోత్సవాన్ని శనివారం హెచ్‌ఎం చంద్రకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన జానపద, దేశభక్తి గీతాలు, పౌరాణిక నాటికలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో చదివి నవోదయ, టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపినవారికి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.2వేల చొప్పున అందజేస్తానని ఏఓ బసవ రాంబాబు ప్రకటించారు. తనవంతు సహకారం అందజేస్తానని ఎస్‌ఎంసీ చైర్మన్ రాంప్రసాద్ తెలిపారు. సర్పంచ్ రత్నాలు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, కొత్తూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవిందావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30 వరకు ఈకేవైసీ పొడిగింపు

పొందూరు రూరల్: మండలంలోని రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ ఏప్రిల్ 30వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని తహసీల్దార్ వెంకటేష్ శనివారం తెలిపారు. ఈకేవైసీ లేకపోయినప్పటికీ ఏప్రిల్ రేషన్ అందజేస్తామన్నారు. ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

అదుపుతప్పిన లారీ..

- డ్రైవర్‌కు గాయాలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై మండలంలోని తామరాపల్లి వద్ద శనివారం ఉదయం లారీ అదుపుతప్పింది. టెక్కలి వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ.. ముందు ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. కొద్ది క్షణాల్లోనే లారీ రివర్స్‌లో వెనక్కి వచ్చి డివైడర్ దాటి శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వెళ్లే రహదారిపై ఆగింది. ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దట్టమైన పొగమంచు వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏగ్రీవం

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో బార్ అసోసియేషన్ ఎన్నిక శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం.అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా వి.సుధాకరరావు, ఉపాధ్యక్షుడిగా సి.హెచ్.రవికిరణ్, సహాయ కార్యదర్శిగా ఆర్.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా సి.హెచ్.ప్రసాదరావు, ఐదుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పొందూరు: స్థానిక డీసీఎంఎస్‌లో అపరాల కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రమణి, రణస్థలం సహాయ వ్యవసాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. మినుములు క్వింటా రూ.7,400, పెసలకు రూ.8,682లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులు తమ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించేందుకు రైతు సేవా కేంద్రల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏఓ బెండి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట ఖరారు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ మార్కెట్ ఆశీలు వసూలు కోసం సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడు అధ్యక్షతన గ్రామ సచివాలయంలో శనివారం వేలం పాట నిర్వహించారు. ఈఓపీఆర్డీ వసంతకుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేలం పాటలో 81 మంది పాల్గొన్నారు. కూనిబిల్లి అన్నపూర్ణమ్మ రూ.2,28,000లకు వేలం పాట పాడినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు.

క్వారీని నిలిపివేయాలని ఫిర్యాదు

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు–సి పంచాయతీ పరిధి హరినారాయణ కాలనీకి సమీపంలో ఉన్న క్వారీని వెంటనే నిలిపివేయాలని తహసీల్దార్ పాపారావుకు శనివారం స్థానిక యువకులు ఫిర్యాదు చేశారు. కాలనీకి సమీపంలో ఉన్న కొండపై రాళ్లను పేల్చుతూ స్టోన్ క్రషర్‌కు తరలిస్తున్నారన్నారు. రాళ్ల ముక్కలు ఇళ్లపై పడటంతో పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. రాత్రివేళల్లో బాంబులను పేల్చడంతో వచ్చే శబ్దాలకు వృద్ధులు, చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. క్వారీలో పేలుడు పదార్థాలు వినియోగించకుండా చూడాలని కోరారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో దుక్క బాలరాజు, పత్రి మణికంఠ, తిరునగిరి ప్రసాద్, కుడితూరి మురళి, తదితరులు ఉన్నారు.

విచారణ

హిరమండలం: తంప పంచాయతీలో అక్రమాలు జరిగినట్లు అందిన ఫిర్యాదుపై శనివారం డీఎల్‌పీఓ ఆర్.గోపీబాల విచారణ చేపట్టారు. ఇటీవల గ్రామానికి చెందిన చిన్నబాబు అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ రికార్డులను డీఎల్‌పీఓ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుడుతోపాటు సర్పంచ్, ఉప సర్పంచ్‌ల వద్ద వివరాలు సేకరించి నివేదిక తయారుచేశారు. నివేదికను జిల్లా అధికారులకు అందించన్నుట్లు డీఎల్‌పీఓ తెలిపారు. మండల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉగాది వేడుకలు

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డు సమీపంలోని కొండపై ఉన్న షిర్డీ సాయి బాబా ధాన్య మందిరంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఉగాది వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు బాబా సేవా సంఘం సభ్యులు తారకేశ్వరరావు శనివారం తెలిపారు.

